

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజ లు తమ అర్జీలు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా నమోదు చేసే అవకాశం ఉందన్నారు.

కొండామంటే.. బంగారమాయె!

- లక్ష దాటేసిన 10 గ్రాముల బంగారం
- 24 క్యారెట్ ధర రూ.1,01,670
- 22 క్యారెట్ రూ.93,200

(రాజమహేంద్రవరం/అమలాపురం- ఆంధ్రజ్యోతి)

పసిడి ధర మిడిసిపడుతోంది. బంగారం అందని ద్రాక్షగా మారేలా ఉంది..ఎందుకంటే ఎక్కడా తగ్గుముఖం లేదు.. పెరుగుతూనే ఉంది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందని సరుకుగా మారిపోతోంది. ఇక బంగారం కొనలేం అన్నట్టు ధర పెరుగుతూ పోతోంది.తులం బంగారం లక్ష దాటేసింది. ధర రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారని వ్యాపారులు,వినియోగదారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.93,200లకు చేరింది.24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర ఏకంగా రూ.లక్ష దాటేసింది. రూ.1,01,670గా ఉంది. వెండి ధర లక్షకు పైగా ఉంది.ప్రస్తుతం కిలో వెండి రూ.1,09,400గా ఉంది. శనివారం నుంచి ఈ ధరలు కొనసాగుతున్నాయి. సోమవారం తగ్గుతుందా.. పెరుగుతుందా అనేది అంచనా వేయలేని పరిస్థితి. ఇజ్రా యిల్, ఇరాన్ యుద్ధం, రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగారం ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.ఈ నెల 26వ తేదీ తర్వాత ఆషాఢమాసం వస్తుంది. బంగారం కొనుగోళ్లు ఉంటాయి. తర్వాత శ్రావణ మాసం జోరందుకుంటుంది.కానీ పెరుగుతున్న ధరలతో తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలని పాలుపోని పరిస్థి తిలో మధ్య తరగతి సామాన్య ప్రజలు ఉన్నారు.

5 నెలలు..రూ.22 వేలు పెరుగుదల

ఇక జనవరి 1 నుంచి ఆదివారం అంటే జూన్ 15వ తేదీకి అంటే సుమారు 5 నెలల 15 రోజులకు 10 గ్రాముల బంగారం ధర రూ.22 వేలు వరకూ పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.93,200కు చేరింది.ఇదే బంగారం ధర జనవరి 1న కేవలం 71,150గా ఉంది.ఇక 24 క్యారెట్ బంగారం ధర ప్రస్తుతం రూ.1,01, 670 ఉండగా జనవరి 1న రూ.78 వేలు మాత్రమే. అంటే సుమారు 23 వేలు తేడా ఉంది. ప్రస్తు తం కేజీ వెండిధర రూ.లక్షా 9వేల 400గా ఉంది. జనవరి ఒకటన కేజీ వెండిధర రూ.88,400 మాత్రమే. జనవరి నుంచి ఇప్పటికి సుమారు రూ.21 వేలు పెరిగింది.



మార్కెట్లు..కళకళ!



తల్లికి వందనం.. జనం ఆనందం

- జనం జేబుల్లో కాసులు గలగల
- ఆదివారమైనా రద్దీగా మార్కెట్లు
- పట్టణాలకు పల్లెవాసుల క్యూ
- చిన్నారుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి

తల్లికి వందనం డబ్బులతో జూన్ నెల టెన్షన్ నెమ్మదించడంతో కుటుంబమంతా ఆనందంగా కనిపిస్తున్నారు. దీనికి నగరాల్లోని ప్రధాన మా ర్కెట్లే నిదర్శనంగా చెప్పవచ్చు. రాజమ హేంద్రవరంలో పెద్ద బజారుకు వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తల్లికి వందనం సమయానికి అందడంతో తన ఇద్దరు మనవళ్లతో బజారుకు వచ్చానని సెయింట్ ఆన్స్‌లో చదువుతున్న విద్యార్థుల బామ్మ చెప్పారు. సీఎం చంద్రబాబు తన పిల్లలకు ఇచ్చిన డబ్బులతో వాళ్లకే సైకిల్ కొనడానికి వచ్చానని కొంతమూరుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ ఆనందంగా చెప్పారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు సమయానికి పడడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆనందంగా ఖర్చు చేస్తున్నారు..దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో ఆదివారం పెద్ద ఎత్తున రద్దీ కొనసాగింది.





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మార్కెట్లు కళకళలాడాయి..ఎటు చూసినా షాపులు జనంతో నిండిపోయాయి.. ఆదివారమైనా ఎక్కడా ఖాళీ లేదు.. పిల్లాపాపలతో పట్టణాలకు చేరుకుని చాలా మంది షాపింగ్ చేసే పనిలో పడ్డారు. సోమవారం నుంచి విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు షాపింగ్ చేసే పనిలో పడ్డారు. ఎక్కువగా బట్టల షాపులు,షూమార్ట్‌లు, బ్యాగ్‌ల దుకాణాలు, పుస్తకాల షాపులు కిటకిటలాడాయి. మరో వైపు ఫర్నిచర్ షాపులదీ అదే పరిస్థితి. ప్రతి ఆదివారం వాణిజ్యనగరం రాజమహేంద్రవరంలో ఈ షాపులు మూసివేసే ఉంటాయి. ఈ ఆదివారం ప్రత్యేకంగా తెరుచుకున్నాయి.

వ్యాపారుల ఆనందం..

'చాలా నెలల నుంచీ పెద్దగా బేరాలు లేవు. ఇవాళే కాస్త కుదుట పడుతున్నాం' అని ఓ వ్యాపారి అన్నాడంటే మార్కెట్లలో కళను అర్థం చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో చూస్తే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ప్రధానంగా మార్కెట్లు ఉంటాయి. కొద్ది నెలలుగా ఈ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. ఈ ఆదివారం మాత్రం ఈ మార్కెట్లు రద్దీగా కనిపించాయి. ఎక్కువగా స్కూల్‌కి సంబంధించిన అవసరాల దుకణాల వద్ద జాతర మాదిరిగా జనం హడావుడి ఉంది. దీంతో వ్యాపారులు కూడా కాస్త హుషారుగా అమ్మకాలు సాగించారు. ఆదివారం కావడంలో పెద్ద షోరూమ్‌లకు మూత వేస్తారు. గతంలో మంగళవారం సెలవుగా ఉండేది. ఆదివారం ఉద్యోగులకు, పాఠశాలలకు సెలవు కావడంతో ఆ రోజున బేరం ఎక్కువగా ఉంటుందని మంగళవారం సెలవు పుచ్చుకోవడం ఉండేది. అయితే కొన్నాళ్లుగా ఆదివారం మూసేస్తున్నారు. అయితే సండే సామాన్యుడి మార్కెట్ల దెబ్బకు బేరాలు ఉండడం లేదనే ఇబ్బందితో కూడా పెద్ద షాపులు కట్టేస్తున్నారు. అక్కడక్కడా తెరిచి ఉన్న షోరూంలలో జనం టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాల వంటి ఉపకరణాలు, వంట గది సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. డి.మార్ట్, రిలయన్స్, మోర్, విశాల్ తదితర షాపింగ్ మాల్స్ అయితే జనంతో రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రద్దీ కొనసాగింది. ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయాయి. ఈ ఆదివారం వ్యాపారం డబుల్ జరిగిందనేది ఒక మేనేజర్ వాదన. కాస్త డబ్బులు ఖాతాలో ఉండడం..నాలుగు రోజులు గడిస్తే వాటికి కాళ్లు వచ్చేస్తాయనే భయంతో ఇంట్లోని ఆడవారు అవసరమైన వస్తువులు /సామగ్రిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.మరోవైపు చిన్న చిన్న అప్పులను తీర్చుకోవడానికి తల్లికి వందనం సహకరించింద ని పలువురు వెల్లడించారు.బంగారం వస్తువుల కొనుగోలుపై కొందరు మహిళలు దృష్టి సారించారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు అందరికీ ఉపకరించడంతో ఆనందంగా ఉన్నారు.

కుదుటపడిన బడ్జెట్..

ఏడాదిలో జూన్ నెల వచ్చిందంటే కుటుంబ బడ్జెట్‌కి దడ పట్టుకుం టుంది. ఒక్కో విద్యార్థికి ఎలా లేద న్నా రూ.10వేల వరకూ ఖర్చు తప్పదు.చంద్రన్న పుణ్యమా అని ఆ డబ్బులకు వెతుకులాడుకునే పరిస్థితి తప్పింది. జూన్‌లో స్కూల్ ఖర్చులతో మెయింటెనెన్స్ డబుల్ అవుతుంది.ఓ వైపు ఫీజులు కట్టుకొని మరో వైపు బ్యాగులు,షూలు, పుస్తకాలకు వెచ్చించాలి. ఎంతో కొంతలో కొత్త బట్టలు.. ఇతర ఖర్చులు మామూలే.దీంతో ఈ నెల వచ్చే సరికి సామాన్యుల బుర్ర అప్పు లోళ్ల చుట్టూ తిరుగుతుంది. ఎంతో కొంత చేబదులు పుచ్చుకుంటేనే గానీ ఖర్చులు గట్టెక్కని పరిస్థితి. తీరా స్కూలు అవసరాలు తీరాయని సేద తీరడానికి ఉండదు. నెలంతా ఇల్లు గడవాలి కదా!..అయితే ప్రభుత్వం దయ చూపడంతో పేద లు, మధ్య తరగతి జీవితాలకు ఈ నెలలో రుణం పుచ్చుకునే అవసరత తప్పింది. సీఎం చంద్రబా బు తన హామీని నిలబెట్టుకుంటూ తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుండడంతో హుషారుగా బజారుకు వెళ్లి ఉత్సా హంగా అన్నీ కొనేసి పిల్లల ఆనందంలో తమ సంతోషాన్ని చూసుకుంటున్నారు. ఖాతాల్లో డబ్బులు గలగల లాడడంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.





ఇక తవ్వేయ్!

- రేపోమాపో మైనింగ్ పాలసీ
- ఏడాదిగా కొత్త లీజుల్లేవ్
- కుంటుపడిన మైనింగ్
- గత వైసీపీలో పూర్తిగా ధ్వంసం
- మార్పులతో ప్రభుత్వం శ్రీకారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలు కాబోతుంది. రేపో మాపో మైనింగ్ పాలసీ మీద జీవో రాబోతుంది. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పెద్దలే నేరుగా రంగంలోకి దిగి.. లీజుదార్లను తరిమికొట్టేసి మైనింగ్ చేయించిన సంఘటనలు ఉన్నాయి.గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలో వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పాలసీ తెచ్చింది.కానీ ఏడాదిగా మైనింగ్ లీజులు లేవు.ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. దానిని జీవో రూపంలో ఒకటి రెండు రోజుల్లో జారీ చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్ మెటల్, రోడ్ మెటల్, గ్రానైట్, గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో ఇప్పటి వరకూ స్వంత స్థలాలు లీజుకు తీసుకున్నవారు తప్ప.. ప్రభుత్వ స్థలాలు లీజుకు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో 250 దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 250 లీజు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.ఒకట్రెండు రోజుల్లో రాబోతున్న కొత్త మైనింగ్ పాలసీ వల్ల మళ్లీ లీజులు మొదలు కానున్నాయి.ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13వ తేదీ నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కారానికి ఒక విధానం రూపొందించారు.సింగిల్ డెస్క్ పోర్టల్, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు గుర్తించి జిల్లా మైనింగ్ అధికారి లాగిన్‌లో ఉంచుతున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలిపి అర్హత లేనివాటిని తొలగిస్తారు. అర్హత ఉన్న దరఖాస్తుదారుల నుంచి భద్రత డిపాజిట్ కట్టించుకుంటారు. మూడు నెలల్లోపు ఈ చెల్లింపులు చేయాలి. తర్వాత ఎన్‌వోసీ, డీజీపీఎస్ సర్వేలు చేస్తారు. భద్రత డిపాజిట్ చెల్లించకపోతే అర్హత కోల్పోతారు. గ్రానైట్ల మార్బుల్,బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేయాలి. ఇండస్ట్రియల్ మినరల్‌కు వేలం పద్ధతి ఉంటుంది.ఇవన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ

గత ప్రభుత్వంలో మైనింగ్ అంతా ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ పెద్దల చేతుల్లోకి పోయింది. అంతకుముందు ఎవరైనా వ్యక్తికి సొంత కొండ ఉంటే దానిని పంట సాగుకు సరిచేసుకోవడానికి తహశీల్దార్, ఇతర అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోయేది. ప్రస్తుతం సొంత భూమిలో మినరల్ ఉన్నా, కొండలు ఉన్నా, ఆయా ఎమ్మెల్యేల అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. ఇటీవల అక్కడక్కడా తవ్వుతున్న గ్రావెల్, మట్టి వంటి వాటిలో కూడా లారీకి రూ.3 వేల వరకూ ఆయా ప్రాంత ప్రతినిధులు లాగేస్తుండడం గమనార్హం. గత ప్రభుత్వం సీనరేజి ప్రైవేట్ పరం చేసి కూడా బాగా దోచుకుంది. రేపో మాపో ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న కొత్త మైనింగ్ పాలసీలో ఏ మినరల్‌ను ఏ విభాగంలో పెడతారో, ఏ ధరలు నిర్ణయిస్తారో, సీనరేజి పరిస్థితి ఏంటో అనే చర్చ ఆయా వర్గాల్లో మొదలైంది.

కోకో రైతులకు ప్రత్యేక సెల్ : ఆర్డీవో



కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజల కొనుగోలుకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల నుంచి కోకో గింజల సేకరణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులెదురైతే ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సోమవారం నుంచి ఈ సెల్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వాస్తవ సాగుదారుల నుంచి కోకో దిగుబడుల వివరాలను ఈ నెల 30వ తేదీలోగా సేకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారన్నారు. కోకో గింజలకు కనీస మద్ద తు ధర రూ.500లు రావాలని ఈ సెల్ ఏర్పా టు చేశామన్నారు. ఏమైనా సందేహాలుంటే 79953 67797 నెంబరును పనివేళల్లో సంప్రదించాలన్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించడానికి ఉద్యానవన అధికారి అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు.



ఈ వయసులో..అనాథలా!

కాటికి కాలు చాచిన వయసులో ఎంతో మంది వృద్ధులకు జీవశ్చవాలుగా కాలం వెళ్లదీస్తున్నారు..అయినా పట్టించుకునే వారే లేరు..రోజురోజుకు అనాథలుగా మారుతున్న వృద్ధుల సంఖ్య కోకొల్లలు.. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఇటువంటి వారి పరిస్థితి దయనీయమే.. ఈ చిత్రంలో చూశారా..ఈ వృద్ధుడు లేచి నడవలేడు.. గత మూడు నెలలుగా జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం సమీపంలోని రావులపాలెం- వేమగిరి జాతీయరహదారిలో ఆంజనేయస్వామి ఆలయం కింద ఉంటున్నాడు.. ఎవరైనా ఏదైనా పెడితే తింటాడు..లేదంటే పస్తులుంటాడు.. మీ ఊరెక్కడ అంటే రాజస్థాన్ అంటున్నాడు.. పేరు అంటే మధు అంటున్నాడు.. మిగిలిన వివరాలేవీ చెప్పలేకపోతున్నాడు.. జిల్లా అధికారులు స్పందించి ఇటువంటి వృద్ధు లను వృద్ధాశ్రమాలకు తరలించాల్సి ఉంది. - **కడియం**

గోకవరంలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన 24 గంటల్లో గోకవరం మండలంలో అత్యధికంగా 88.8 మి.మీ.. అత్యల్పంగా పెరవలి,నల్లజర్లలో 2.6 మి.మీ వర్షం కురిసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ 41.2 మి.మీ, రూరల్‌లో 39.4 మి.మీ, తాళ్ళపూడిలో 31.8, రాజానగరం 30.2, కోరుకొండ 26.4 , సీతానగరంలో 25.0 , అనపర్తిలో 19.2, బిక్కవోలులో 10.8, కడియంలో 7.6, దేవరపల్లి 7.2, కొవ్వూరులో 6.8, చాగల్లులో 6.4, నిడదవోలులో 6.4, రంగంపేటలో 4.8, గోపాలపురంలో 4.0, ఉండ్రాజవరంలో 3.2, నల్లజర్లలో 2.6 మి.మీ వర్షం కురిసింది. అధికశాతం ఆదివారం తెల్లవారుజామున వర్షం పడింది.

ఆహా లివ్!



హోప్ ఐలాండ్ తీరంలో గుడ్లు పెట్టిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఆలివ్ రిడ్లే.. చేస్తోంది మేలు..

- సముద్రజలాల సంరక్షణ
- మత్స్యసంపద అభివృద్ధి
- డిసెంబర్ - మే మధ్య సంచారం
- గుడ్లు పెట్టి సంతానోత్పత్తి
- కాకినాడ,కోనసీమలో సంరక్షణ
- నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం

కొన్ని జీవులు చాలా తెలివిగా ఉంటాయి.. వాటి తెలివితేటలు అంచనా వేయడం అంత సులభం కాదు.. అటువంటి జీవుల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్ల గురించి చెప్పకుండా ఉండలేం.. అవి దేశవిదేశాలు తిరిగి మళ్లీ అవి ఎక్కడైతే పుడతాయో అక్కడే పిల్లలను పొదుగుతాయంటే నమ్ముతారా.. నమ్మక తప్పదు మరి.. ఎందుకంటే ఇది నిజం.. ఆ కథేమిటో తెలియాలంటే ఈ కథనం చదివేయాల్సిందే మరి.. నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- 2023-24లో హోప్ ఐలాండ్‌లో 262 తాబేళ్లు 23,202 గుడ్లు పెట్టాయి.
- 2024-25లో హోప్‌ఐలాండ్‌లో 283 తాబేళ్లు 20,623 గుడ్లు పెట్టాయి.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ చర్యలు

కాకినాడ/ఉప్పలగుప్తం/కాట్రేనికోన, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితం కాకుండా.. మత్స్యసంపద అభివృద్ధికి సహకరించే సముద్రపు జీవుల్లో ప్రత్యేకమైనవి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. తీరానికి దూరంగా సముద్రపు లోతుల్లో జీవించే ఈ తాబేళ్లు సాగర జీవుల ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తాయి.సముద్రపు నాచు తింటూ.. జలాలను శుభ్రపరుస్తాయి. సముద్రంలో తాబేళ్ళ సంఖ్య తగ్గిపోతే ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించిన ప్రభుత్వం ఏటా వీటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏడు రకాల సముద్రపు తాబేళ్లు ఉంటాయి. మన భారతదేశ సముద్ర జలాల్లో ఐదు రకాల సముద్రపు తాబేళ్లు ఉన్నాయి. వాటిలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒకటి. ఈ జాతి ఆడ, మగ తాబేళ్లు ఏటా డిసెంబర్ మాసంలో సంతానోత్పత్తికి సముద్రంలో కలుసుకుంటాయి. కొన్నిరోజులపాటు తీర ప్రాంతంలో సంచరిస్తాయి. జనవరి మొదటివారం నుంచి ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు సిద్ధమవుతాయి. ఫిబ్రవరి నెలలో భారీగా గుడ్లు పెట్టి.. ఏప్రిల్ నాటికి పూర్తిగా ఆపేస్తాయి. ఇవి పెట్టిన గుడ్లు పొదిగి పిల్లలుగా మారేందుకు సుమారు 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ డిసెంబర్ నుంచి మే వరకు జరుగుతుంది.ఈ ఆరు నెలల్లో ఆలివ్ రిడ్లే సంతానోత్పత్తి జరుగుతుంది.కోనసీమ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల హేచరీలున్నాయి.

ఒడిశా టు కాకినాడ..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవన విధానం, పునరుత్పత్తి గురించి పరిశోధనలు జరుగుతున్నాయి.అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రం నుంచి ఇవి వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటాయి. ఒక తాబేలు ఒడిశాలో కేంద్రపడ జిల్లా గహీర్‌మర్ వద్ద సముద్రంలో ప్రయాణం ప్రారంభించి 51 రోజుల తర్వాత శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరిల మీదుగా ఇది ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకుంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాగ్ దీనికి అమర్చి పరిశీలించగా ఈ విషయం తెలిసిందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.వాటికి అనుకూలమైన వాతావరణం ఉన్న కాకినాడ హోప్ ఐలాండ్‌తో పాటు కోనసీమలోని పలు తీర ప్రాంతాల్లో ఇవి సంతానోత్పత్తి చేపడతాయి.

కాకినాడ, కోనసీమ తీరాలకు..

సంతానోత్పత్తి సమయంలో ఈ ఆలివ్ రిడ్లే తాబేళ్లు కాకినాడ హోప్‌ఐలాండ్, కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం, వాసాలతిప్ప, జీకే పోర, సాక్రిమెంట్ ఆయిల్ పలు తీరప్రాంతాలకు పెద్ద ఎత్తున వస్తుంటాయి.ప్రధానంగా డిసెంబర్ నెలలో 15-20 రోజులపాటు తీర ప్రాంతాల్లో ఇవి ఉంటాయి. మగ తాబేలు సముద్రంలోకి వెళితే.. కేవలం ఆడ తాబేళ్లు మాత్రమే తీరంలో ఉంటూ గుడ్లను పెట్టి తిరిగి వెళ్లిపోతాయి. అడుగు నుంచి అడుగున్నర లోతు గొయ్యిని తవ్వుకుని..వాటిలో 60 నుంచి 160 వరకు గుడ్లు పెడతాయి.ఈ సమయంలో గుడ్లు రూపాంతరం చెందుతాయి. 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కన్నా తక్కువుంటే ఆ సమయంలో పెట్టిన గుడ్లన్నీ మేల్ జాతికి చెందినవిగా, 30 డిగ్రీల ఉష్ణోగ్రతపైబడి ఉన్న సమయంలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగా మారతాయి. 28-30 డిగ్రీ మధ్య ఉష్ణోగ్రతలో జన్మించిన తాబేళ్లు అటు మేల్ అయినా కావొచ్చు. ఇటు ఫిమేల్ అయినా కావొచ్చని శాస్త్రవేత డి.మహేష్‌బాబు తెలిపారు.

ఆ రెండింటి మధ్య వ్యత్యాసాలివే..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఏ తీరానికి పడితే ఆ తీరానికి రావు. ఒకసారి ఎక్కడైతే సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టాయో.. తిరిగి అదే ప్రాంతానికి వస్తాయి. సాధారణ తాబేళ్ల కన్నా ఇవి పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఇవి 35 నుంచి 50 కిలోల బరువుతో సముద్రపు నీటిలోనే ఉంటాయి. తాబేళ్లు తీరానికి చేరుకునే సమయంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో బోట్లు తిరగకుండా, చేపల వేట నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తాబేళ్ల రాకకు ఏటా అటవీశాఖ అధికారులు బేస్ క్యాంపులు సిద్ధం చేస్తున్నారు.ఏటా తాబేళ్ల రాక సంకేతాలను గుర్తించి బీచ్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేస్తున్నారు.గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నారు.



సంరక్షణకు ప్రత్యేక చర్యలు

1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. సముద్ర తాబేళ్లను సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. హేచరీలను ఏర్పాటు చేసి వాటి సంతతిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. కాకినాడ హోప్‌ఐలాండ్‌లో మత్స్యకార కుటుంబాలకు వీటి సంరక్షణ బాధ్యత అప్పగించి, వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. ఆరుగురు బృందంగా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నాం,

- ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, కోరింగ వైల్డ్ లైఫ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



జల జోష్!

యువత అంటేనే జోష్. అలాంటి నదిలో స్నానాలంటే రెట్టించిన ఉత్సాహంతో ఉరకలు వేస్తుంటారు. దానికి నిదర్శనమే ఈ చిత్రాలు. రాజమహేంద్రవరం గోదావరి పుష్కర్ ఘాట్‌లో యువకులు చేస్తున్న జల విన్యాసాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

పాపికొండలకు 196 మంది పర్యాటకులు



పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోటు

దేవీపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాపికొండల విహారయాత్రకు ఆదివారం 5 బోట్లలో 196 మంది పర్యాటకులు వెళ్లారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి అందాలు ఆస్వాదించేందుకు పర్యాటకులు దేవీపట్నం మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకుని పాపికొండలకు వెళ్లారు. ఆలయానికి రూ.20,800 ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. భక్తులకు గోదావరిలో స్నానాలచరించేందుకు వెళ్లనీయకుండా పోలీసు, ఆలయ సిబ్బంది గస్తీ ఏర్పాటు చేశారు.

ముగిసిన సుదీర్ఘ విరామం

వేటకు పయనం..



కొత్తపల్లి మండలం రామన్నపాలెం ఉప్పుటేరులో లంగరు వేసిన బోట్లు

తొండంగిలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి/ తొండంగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సుమారు 61 రోజుల సుదీర్ఘ విరామం అనంతరం మత్స్యకారులు శనివారం తెల్లవారు జామున సముద్రం పైకి వేటకు వెళ్లారు. బోట్లలో ఆయిల్ నింపి, తినడానికి సామాన్లతో బయలుదేరారు. కాకినాడ జిల్లా కొత్తపల్లిలో, తొండంగి తీరంలో ఆదివారం పూర్తిస్థాయిలో వేటకు బయలుదేరి వెళ్లారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ చేపల వేటపై నిషేధం ఉండడం వల్ల వేట సాగలేదు. ప్రభుత్వం ఈ ఏడాది వేట విరామ పరిహారంగా రూ.20వేలు అందించడంతో మత్స్యకారులు ఊరట చెందారు. వేటే ప్రధాన జీవనాధారంగా గల మత్స్యకారులు నిషేధ సమయం ముగియడంతో గంగమ్మకు పూజలు చేసి వేట ప్రారంభించారు. తొండంగి మండలంలో అద్దరిపేట నుంచి చోడిపల్లి పేట వరకూ ఉన్న 2763 మంది బోట్ల ద్వారా వేట సాగించే మత్స్యకారులు పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణం కొంత మేరకు అనుకూలంగా లేకున్నా సెంటిమెంట్ ప్రకారం వేట సాగించే పనికి శ్రీకారం చుట్టారు. అయితే ఆశించినంతగా మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో నిరాశగా ఒడ్డుకు చేరారు.

ఉప్పాడలో ఎగసిపడుతున్న అలలు



కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో రోడ్డుపైకి ఎగసిపడుతున్న కెరటాలు

కొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. అల్పపీడనంతో సంబంధం లేకుండా కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ శివారు కొత్తపట్నం సమీపంలో సముద్రం లోపలి నుంచి కెరటాలు విరుచుకుపడి గట్టును దాటి బీచ్ రోడ్డును తాకడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాన్న తిరిగొచ్చాడు

ఫాదర్స్ డే ఆనందమిచ్చాడు

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయినా పిల్లలపై బెంగ, మమకారం పోలీసుల చొరవ ఆ వ్యక్తిని తిరిగి రప్పించాయి. ఫాదర్స్ డే రోజున తండ్రిని తిరిగి కలుసుకున్న ఆ పిల్లల్లో ఆనందం వ్యక్తమైంది. కాకినాడ జిల్లా పిఠాపురం డ్రైవర్స్ కాలనీకి చెందిన గీసాల శ్రీనివాస్ (39) మే 29న తన స్నేహితుడైన కాకి రమణ మోటారుసైకిలు తీసుకుని ధవళేశ్వరంలో ఒక వ్యక్తి డబ్బులు ఇవ్వాలని చెప్పి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల వరకు భార్యతో ఫోనులో మాట్లాడి తర్వాత స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అనుమానం వచ్చిన భార్య లక్ష్మి బంధువుల సహాయంతో వెదకగా తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద శ్రీనివాస్ తీసుకువెళ్లిన బైక్, దుస్తుల బ్యాగు, చెప్పులు కనిపించాయి. దీనిపై మే 31న లక్ష్మి భర్త అదృశ్యంపై ఫిర్యాదు చేయగా పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 3 బృందాలను ఏర్పాటు చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విచారణ చేపట్టారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బైకు, దుస్తులు, ఇతర వస్తువులు వదిలిన అనంతరం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వరకు వెళ్లినట్టు గుర్తించారు. అప్పుల బాధ నుంచి విముక్తి పొందాలనే ఉద్దేశ్యంతో అక్కడి నుంచి కాశీ వెళ్లినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. అతడిని కాంటాక్ట్ చేసే రప్పించేందుకు పోలీసులు ప్రయత్నించారు. అదే సమయంలో భార్య, పిల్లలపై బెంగతో శ్రీనివాస్ ఆదివారం పిఠాపురం తిరిగివచ్చాడు. ఫాదర్స్ డే రోజున శ్రీనివాస్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ తండ్రి తిరిగి రావడంతో ఆ పిల్లలు ఎంతో సంబరపడ్డారు. తండ్రిని తమ చెంతకు చేర్చిన సీఐ శ్రీనివాస్‌కు పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీనివాస్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

తల్లికి వందనంతో వెల్లివిరిసిన ఆనందం

● ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ● త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం ● మంత్రి సుభాష్



సమావేశంతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుతో తల్లుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తుందని, ప్రభుత్వానికి తల్లులు వందనం చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం బులుసు కల్యాణమండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. చదువుకు మించి ఆయుధం లేదని, చదువుతో ప్రపంచాన్ని మార్చవచ్చన్నారు. పాఠశాలలు తెరచిన నాటికి సకాలంలో ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో విద్యార్థులకు ఉపయోగపడిందన్నారు. వైసీపీ పాలకులు రాష్ట్రంలో 67.27 లక్షల మందికి అమ్మఒడి ఇచ్చామని చెప్పి కేవలం 42 లక్షల మందికి మాత్రమే ఇచ్చారని మంత్రి ఆరోపించారు. ఫీజు రీఎంబర్స్ మెంటు పథకం బకాయిలు పెట్టడంతో కూటమి ప్రభుత్వంపై భారం పడిందన్నారు. తల్లులు లేనివారికి తండ్రి లేదా సంరక్షకుని ఖాతాలో తల్లికి వందనం డబ్బులు జమచేశామన్నారు. పాఠశాలలు తెరచిన రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు అందచేశామన్నారు. రాష్ట్రంలో 9600 ఆదర్శ పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడిని నియమించి విద్యా ప్రమాణాలు మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి హాస్టళ్లకు సన్నబియ్యం ఇప్పటికే సరఫరా చేశామన్నారు. గత ప్రభుత్వం నాడు- నేడు పథకంతో నిధులు కాజేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకొచ్చి గాడిలో పెట్టామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలుచేస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే విధానాలు మానుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ రామారావుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘ నేతలతో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2013లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో మెజారిటీ సంఘీయుల ఆమోదంతో తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానన్నారు. అప్పట్లో ఎన్నికలు పెట్టి సంఘీయుల మధ్య చీలిక తేవాలని భంగపడ్డ కొందరు తిరిగి ఇప్పుడు పద్మశాలిల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి విధానాలు మానుకుని సంఘీయుల కోసం పాడుపడాలన్నారు. ఆలిండియా పద్మశాలి పురోహిత సంఘం గౌరవాధ్యక్షుడు, పద్మశాలి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు ఆమంచి అంజనేయస్వామి మాట్లాడుతూ పద్మశాలిల సంక్షేమం కోసం రామకృష్ణ ఎంతో కృషి చేశారన్నారు. సమావేశంలో డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, పేరిశెట్టి లారయ్య, మేరెడి భాస్కరరావు, నేమాని ఆదివిష్ణు, పొన్నగంటి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

‘అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి

ఉన్నతాధికారులతో కమిటీ నియమించాలి’




అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో అగ్రిగోల్డ్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

అమలాపురం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులతో కమిటీలను నియమించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటుచేసి తగిన నిధులు కేటాయించాలన్నారు. కోనసీమ జిల్లా అమలాపురం అశోక్‌నగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పులపర్తి సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తిరుపతిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు వీవీ నాయుడు, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు కొప్పుల సత్తిబాబు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే అగ్రిఆస్తులు కబ్జాలకు గురయ్యాయన్నారు. పదేళ్ల పోరాట ఫలితంగా రూ.906కోట్లు డిపాజిట్లు చెల్లించడం జరిగిందన్నారు. మిగిలిన రూ.3400కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇచ్చిన హామీ మేరకు న్యాయం జరగకపోతే ఉద్యమబాట పడతామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి లంకేష్, కోశాధికారి శ్రీరామమూర్తి, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ ఏఎన్ఎంలకు ప్రమోషన్స్ కం ట్రాన్స్‌ఫర్స్ కోసం ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో 8 మంది వైద్యాధికారుల బృందం ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకు కౌన్సెలింగ్ జరిపింది. 400 మందికి 390 మంది హాజరయ్యారు. ఏఎన్ఎంలకు ఎంపీహెచ్ఏ(ఎఫ్)లుగా ఉద్యోగోన్నతి కల్పించారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పెళ్లి సందడి మరువకముందే

ప్రాణాలు కోల్పోయిన నవ దంపతులు



సాయి,శాలిని ఫైల్‌ఫొటో

వరుడు పిఠాపురం వాసి

విశాఖలో రోడ్డు ప్రమాదం





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సాయి,శాలిని

మల్కాపురం (విశాఖపట్నం), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల పారాణి ఆరకముందే.. మామిడి తోరణాలు వాడకముందే.. పెళ్లి నాటి సందడిని మరువకముందే ఆ నవ దంపతులు కానరాని లోకాలకు తరలి'పోయారు'. ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న నెల రోజులకే వారిద్దరూ ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. విశాఖలోని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి మారుతి జంక్షన్ వద్ద జరిగిన ఈ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన జొన్నాడ సాయి (27), విశాఖలోని గంగవరం ప్రాంతానికి చెందిన ఎరిపిల్లి శాలిని (25) గాజువాకలోని బెస్ట్ విజన్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరూ ప్రేమించుకోవడంతో పాటు పెద్దలను ఒప్పించి పిఠాపురంలో గతనెల 9న వివాహం చేసుకున్నారు. అనంతరం బంధువులకు గాజువాక ప్రాంతంలో విందు కూడా ఇచ్చారు. ప్రస్తుతం దంపతులిద్దరూ గాజువాకలోనే నివాసం ఉంటున్నారు. శనివారం సాయి పుట్టినరోజు కావడంతో సెలవు లేని కారణంగా ల్యాబ్‌లోనే ఉండిపోయారు. ఆదివారం నగరంలోని ఆర్కే బీచ్‌కు వెళ్లేందుకు ములగాడ రోడ్డు మీదుగా ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మారుతి జంక్షన్ వద్ద ఓ ట్రాలర్ వెనుక నుంచి వీరి వాహనాన్ని బలంగా ఢీకొనడంతో వారిద్దరూ రోడ్డుపై తుళ్లిపడ్డారు. దీంతో సాయి అక్కడికక్కడే మృతిచెందగా, శాలిని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ప్రమాదానికి కారణమైన ట్రాలర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు గాజువాక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాములేరు వాగులో గల్లంతైన

యువకుల మృతదేహాలు లభ్యం



సాదిష్, రవితేజ మృతదేహాలు

మారేడుమిల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పర్యాటక ప్రాంతం పాములేరు వాగులో శనివారం గల్లంతైన డి.సాదిష్(23), కటకం రవితేజ(30) మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువకులు శనివారం మారేడుమిల్లి ప్రాంతానికి పర్యాటకానికి విచ్చేశారు. వీరిలో సాదిష్, రవితేజ పాములేరు వాగులో స్నానానికి దిగి గల్లంతయ్యారు. శనివారం మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఉదయం ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చేయగా వాగులో ప్రమాదకరమైన స్థలం వద్ద వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి మారేడుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సాదిష్ ఫొటోగ్రాఫర్ కాగా రవితేజ కారు ట్రావెల్స్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

భక్తులతో కిటకిటలాడిన ‘లోవ’

రూ.7.17 లక్షల ఆదాయం

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం అశేష భక్తజనంతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణానికి చేరుకుని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. మొక్కులు తీర్చుకుని అనంతరం వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి ఆదివారం ఒక్క రోజే రూ.7.17 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో, ఉప కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

జాతీయ స్థాయి పోటీలకు పిఠాపురం బాక్సర్



ఐశ్వర్య సూర్య దీపిక

పిఠాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన జె.ఐశ్వర్య సూర్య దీపిక ఎంపికైంది. విశాఖపట్టణంలో మే 30, 31 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ బాలికల పోటీల్లో సూర్యదీపిక 80 కిలోల ప్లస్ విభాగంలో రజత పతకం సాధించింది. స్వర్ణ పతకం సాధించిన విజయనగరానికి చెందిన బాక్సర్ జాతీయ పోటీల నుంచి తప్పుకోవడంతో సూర్యదీపికకు ఆ అవకాశం లభించింది. ఈమె ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలోని రోహతక్‌లో జరిగే 6వ జాతీయ స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. సూర్యదీపిక, ఆమె కోచ్ లక్ష్మణరావులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, కె.పద్మనాభం, కూటమి నాయకులు అభినందించారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి



ముత్యాలమ్మ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. తుని మండలం తాళ్ళూరు గ్రామానికి చెందిన గండి ముత్యాలమ్మ (53) తన మనవడు గౌతమ్ చరణ్‌ను వెంటపెట్టుకుని కాకినాడ-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరింది. తునిస్టేషన్ దాటిన తరువాత ఆమెకు వాంతులు అవ్వడంతో డోర్ వద్దకు చేరుకుంది. స్పృహ తప్పి డోర్ నుంచి జారి పడడంతో పాయకరావుపేట మండలం సీతారామపురం సమీపంలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. తుని రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జాగ్రత్త సుమా!



ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్ అంటారు. అంటే ఏదైనా జరిగిన తర్వాత తీసుకునే చర్యల కంటే ముందస్తు జాగ్రత్త ఎంతో మేలని అర్థం. ఇదే నానుడిని టూటౌన్ పోలీసులు అనుసరిస్తున్నారు. సాధారణంగా దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండడానికి.. ఊరు వెళుతున్నప్పుడు పోలీసులు ఉచితంగా అందించే ఎల్‌హెచ్ఎంఎస్ ఉపయోగించుకోండి, విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లండి, ద్విచక్ర వాహనానికి వీల్‌లాక్ వేసుకోండి.. వంటివి సమావేశాలు ఏర్పాటు చేసి చెబుతుంటారు. అయితే టూటౌన్ సీఐ శివగణేశ్ నిత్యం ప్రజలకు కనిపించే విధంగా జాగ్రత్తలను తెలియజేస్తూ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించారు. దీనిపై ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

ఉపాధిలో తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజానగరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో జేపీ ఝాన్సీ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సన్న, చిన్నకారు రైతులు తమ పొలాల్లో మామిడి, జీడిమామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో తదితర 26 రకాల పండ్ల తోటల పెంపకానికి కలెక్టర్ ప్రశాంతి అనుమతించారన్నారు. మూడేళ్ల నిర్వహణ ఖర్చుతో రైతులకు ఉచితంగా చెల్లించనున్నట్టు చెప్పారు. రైతులకు కల్పించే లబ్ధి కింద వివిధ రూపాల్లో లబ్ధిదారునికి పండ్ల రకాలను బట్టి ఒక ఎకరానికి మూడేళ్లకు రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 25వ తేదీ లోగా రైతు తమ దరఖాస్తులను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్/ పంచాయతీ కార్యదర్శి లేదా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయా లన్నారు. అర్హులైన లబ్ధిదారులంతా దరఖాస్తులు చేసుకుని ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పండ్ల తోటల పెంపకాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రకాశంనగర్ మునిసిపల్ హైస్కూల్ 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రకాశం నగర్ సెంటినరీ ఎయిడెడ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని రాజవోలులో జరిగింది. 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసి ఎక్కడెక్కడో స్థిరపడ్డ విద్యార్థులు దాదాపు 35 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి అల్లరి చేష్టలను, మధురానుభూతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఆత్మీయవిందు చేశారు. గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. అనంతరం బరువెక్కిన హృదయాలతో తమ గమ్యస్థానాలకు తిరిగి వెళ్లారు. కాగా ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులైన కిరణ్మయి, సుంకర శ్రీను, ఎంఎస్ఎన్ రెడ్డి, సాంబశివ, భరద్వాజ్, ప్రసాద్, తుమ్మిడి శ్రీను, తిమోతి, కృష్ణ కృషి చేశారు.

సామ్రాజ్యవాద చర్యలకు 19 వరకూ నిరసనలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా, గాజా, ఇరాన్‌లపై అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాద చర్యలు, దురాక్రమణలకు వ్యతిరేకంగా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకూ నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ఒక ప్రకటనలో కోరింది. ఈ మేరకు అన్ని మండలాలు, జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరింది. ఆయా దేశాల ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను, అమెరికా దురహంకార చర్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంది.

నగరాభివృద్ధే ధ్యేయం

కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధే ధ్యేయంగా తాము పని చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ మహిళా కళాశాల వద్ద స్థానిక 4,5 డివిజన్లకు సంబంధించి ప్రమాదకరంగా ఉన్న మేజరు డ్రైనేజీలపై సుమారు రూ.14 లక్షలతో చేపట్టే కల్వర్టుల నిర్మాణానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ కేవలం కొన్ని ప్రాంతాల్లోనే అభివృద్ధి చేశారన్నారు. తాము నగరంలో 32 పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్‌కుమార్, నక్కాదేవి వరప్రసాద్, కార్యకర్తలు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం



గాడ్ ఫాదర్స్ అవార్డులతో సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలనందిస్తూ సమాజంలో తండ్రులంతా గాడ్ ఫాదర్స్‌గా నిలవాలని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి ఆకాంక్షించారు. అంతర్జాతీయ తండ్రుల దినోత్సవం ఆదివారం స్థానిక స్వాతంత్ర సమరయోధుల పార్కు భవనంలో జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్ర కేసరి సహాయ సంస్థ ఆధ్వర్యంలో రఘుపాత్రుని సాయిబాబా, పీచ్చుక రాంబాబు, విద్యావేత్త టీకే విశ్వేశ్వర రెడ్డిలను గాడ్ ఫాదర్స్ అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రుల పట్ల పిల్లల బాధ్యత కొరవడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. కష్టపడి ప్రయోజకులను చేస్తున్న తల్లిదండ్రులకు తలకొరివి పెట్టడానికి కూడా కొడుకులకు సమయం ఉండడం లేదన్నారు. 18 ఏళ్లుగా గాడ్ ఫాదర్ పురస్కారాలను అందిస్తున్న ఆంధ్ర కేసరి సహాయ సంస్థను మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అభినందించారు. కార్యక్రమంలో నందూరి సుబ్బారావు, దుర్వాసుల సత్యనారాయణ రోటరీ క్లబ్ ఐకాన్స్ చాప్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా, సంస్థ నిర్వాహకులు మాదిరాజు శ్రీనివాస్, పీవీఎస్ కృష్ణారావు, దేశిరెడ్డి బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

టైలర్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ ఆకాశపు స్వామి



స్వామిని సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను, ఇబ్బందులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి అన్నారు. టైలర్స్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన స్వామికి ఆదివారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని రజక కల్యాణ మండపంలో జిల్లా టైలర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. అధ్యక్షుడు పి.వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలు, జిల్లా ఫెడరేషన్ సభ్యులు సారథ్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామి మాట్లాడుతూ ఈ నెల 2న ఫెడరేషన్ బాధ్యతలు స్వీకరించిన తాను టైలర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెడరేషన్ కార్యదర్శి పోసిబాబు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులతో గౌరవంగా మెలగాలి

» డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి
» ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ దినం



కార్డులు అందజేస్తున్న కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వృద్ధుల పట్ల దయతో గౌరవంగా మెలగడం సమాజంలోని ప్రతిఒక్కరి బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ దినం సందర్భంగా ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్కులోని డే కేర్ భవనంలో సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కుటుంబ సంబంధ బాంధవ్యాల్లో కాలక్రమేణా వస్తున్న మార్పుల వల్ల వృద్ధులు నిరాదరణకు, వేధింపులకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందువల్ల ఆర్థిక పరమైన విషయాల్లో వారు తగు జాగ్రత్తలు తీసుకోవడం ఆవశ్యకమన్నారు. వీలునామాలు వంటివి రాసే సమయంలో భావోద్వేగాలకు అతీతంగా ఆలోచన చేయాలన్నారు. తమ తదనంతరం మాత్రమే అవి అమలవుతాయనే స్పష్టంగా రాసుకోవడం శ్రేయస్కరమని చెప్పారు. ఇవాళ పెద్దల నుంచి పిల్లలవైపే ప్రేమ ప్రవహిస్తోందని, పిల్లల నుంచి ఆ ప్రవాహం ఉండడం లేదని ఆమె స్పష్టం చేశారు. న్యాయ సేవాధికార సంస్థ వృద్ధులకు అంది స్తున్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. 15100కి ఫోన్ చేయడం ద్వారా కూడా న్యాయ సేవలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, కార్యదర్శి లక్ష్మణరావు, పారా లీగల్ వలంటీర్లు వీర్రాజు, ప్రసాద్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులపై వేధింపులను అరికట్టాలి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నుంచి అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మీదుగా దుర్గమ్మ గుడి ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ కని పెంచిన తల్లిదండ్రులను ఆస్తుల కోసం, చిన్నచిన్న సమస్యలతో రోడ్డున వదిలేయడం సరికాదన్నారు. ఇప్పుడు మీరు చేసిన పనే రేపుభవిష్యత్‌లో మీ పిల్లలు చేస్తే పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్ణాంధ్ర సిబ్బంది కె.దివ్య, జి.మీరాకుమారి, కె.శంకరరావు, వై.హరికృష్ణ, కొండల రావు, ఎం.గణేష్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సర్ణాంధ్ర సిబ్బంది

పంటల్లో పోషక లోపాలను నివారించాలి

మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్య విభాగం శాస్త్రవేత్త రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్‌బాబు

దివాన్‌చెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పలు పంటల్లోని సూక్ష్మ, స్థూల పోషక లోపాలను గుర్తెరిగి వాటి నివారణకు సవరణలు చేసే పద్ధతులు పాటించాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సేద్య విభాగం శాస్త్రవేత్త పీవీ రమేష్‌బాబు అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో జరుగుతున్న వ్యవసాయ సొసైటీ ఎరువుల డీలర్ల సర్టిఫికెట్ శిక్షణ కోర్సులో ఆదివారం రమేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. మొక్కల్లో పోషక మూలకాల లోపం-నివారణ అనే అంశంపై ఆయన శిక్షణ ఇచ్చారు. తగిన పోషకాలను భూమిలో గాని, పిచికారీ ద్వారా గాని పంటకు వాడితే పంటల్లో నాణ్యమైన దిగుబడులు పెంచుకోవచ్చునని అన్నారు. పంటల్లో పోషకాల లోపం వల్ల కలిగే నష్టాలు, గుర్తించే విధానం, సవరణ మార్గాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రమేష్‌బాబు వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ పరిశోధనా స్థానంలో పంటల పోషకాలపై జరిగిన, జరుగుతున్న పరిశోధనలను ట్రైనీలకు వివరించారు. అనంతరం పోషక లోపం కలిగిన కొన్ని పంటల నమూనాలను ట్రైనీలకు చూపారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ వీర్రాజుకు మాతృవియోగం



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు ఆకుల వీర్రాజుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి ఆకుల ఈశ్వరమ్మ(98) ఆదివారం ఉదయం మృతి చెందారు. రాజమహేంద్రవరంలో ప్రముఖ పండ్ల వ్యాపారి దివంగత ఆకుల బాపిరాజు, ఈశ్వరమ్మ దంపతులకు వీర్రాజు, గంగాధర రావు, కృష్ణార్జునరావు సంతానం. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, వైసీపీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, మేడపాటి షర్మిళారెడ్డి, అనిల్‌కుమార్, పంతం కొండలరావు, నందెపు శ్రీనివాస్, ఇసుకపల్లి శ్రీనివాస్, కేవీఎస్ బాబు, కోళ్ల బాబు, అశోక్‌కుమార్ జైన్ తదితరులు ఈశ్వరమ్మ పార్థివ దేహానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

పైపులైన్‌కు మరమ్మతులు

పశ్చిమగోనగూడెంలో సత్యసాయి మంచినీటి పైపులైను పైపులను పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోరుకొండ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పగిలిపోయిన పైపులైన్లకు మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరందించాలని అధికారులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం దాహం.. దాహం.. శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. సెలవు రోజైనా అధికారులను స్థానిక ప్రజాప్రతినిధులను తీసుకుని పశ్చిమగోనగూడెంలో పగిలిపోయిన సత్యసాయి మంచినీటి పైపులైను పైపులను పరిశీలించారు. సొంతంగా జేసీబీని ఏర్పాటు చేసి మరమ్మతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి పథకంలో పైపులన్నీ పాడైపోయాయని, గత వైసీపీ పాలనలో సత్యసాయి మంచినీటి పథకానికి ఏవిధమైన మరమ్మతులు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేసి తాగు నీరందిస్తామని, వచ్చే బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయించి, శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొంగల దేవిక, బదిరెడ్డి దొర, బొమ్ముల గంగరాజు, ముక్కా రాంబాబు, కాపవరం సర్పంచ్ జాజుల రాము, కొయ్యా సామ్యూల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎంపై ప్రేమ తగ్గలేదా?

ఇదిలా ఉండగా.. పశ్చిమగోనగూడెంలో పర్యటించిన ఎమ్మెల్యే బత్తుల స్థానిక రైతు సేవా కేంద్రం భవనంపై మాజీ సీఎం జగన్ ఫొటో ఉండడంతో వ్యవసాయశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం మారి ఏడాది పూర్తయినప్పటికీ ప్రభుత్వం భవనంపై మాజీ సీఎం ఫొటో ఉండడంతో అధికారుల నిర్లక్ష్యాన్ని అక్కడి నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి చెప్పారు. 48 గంటల లోపు ఫొటో మార్చకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆ పక్కనే ఉన్న హెల్త్ క్లినిక్‌పై వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ అని ఉండడాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్ పేరు ఎందుకు మార్చలేదని అక్కడి నుంచే నేరుగా జిల్లా వైద్యశాఖాధికారికి ఫోన్ చేసి ప్రశ్నించారు. మాజీ సీఎం మీద ప్రేమ తగ్గలేదా అంటూ నిలదీశారు. అయితే పేరుపై స్టిక్కర్లు అతికించామని చెప్పబోయిన వైద్యాధికారికి తాను భవనం ఎదురుగానే ఉన్నానని, వైఎస్సార్ పేరుపై ఎలాంటి స్టిక్కరు అతికించలేదని, కట్టుకథలు చెప్పొద్దని జిల్లా అధికారులకు అక్కడి నుంచే వీడియో కాల్ ద్వారా వైఎస్సార్ క్లినిక్ బోర్డును చూపించారు.

పేదల వైద్యానికి ప్రభుత్వం కృషి : గోరంట్ల



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరం రూరల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల తన నివాసంలో పలువురికి రూ.6,61,120 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. కడియం మండలంలో కడియపులంక, కడియపుసావరం, రాజమహేంద్రవరం రూరల్ మండలంలో వెంకటనగరం, కోలమూరు హుకుంపేట డి-బ్లాక్, పిడింగొయ్యి కాతేరు, ధవళేశ్వరం గ్రామాలకు చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల భద్రతే జేడీఆర్ఎఫ్ లక్ష్యం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల భద్రతే జర్నలిస్ట్ డెమోక్రటిక్ రైట్స్ ఫోరం(జేడీఆర్ఎఫ్) లక్ష్యమని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు పూలతోట కృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వై-జంక్షన్ ఆనం రోటరీ హాలులో జేడీఆర్ఎఫ్ సభ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్, ఉభయగోదావరి జిల్లాల రీజనల్ సెక్రటరీ జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ముఖ్యవక్తగా విచ్చేసి కృష్ణ మాట్లాడుతూ విలేకరుల సంక్షేమం, భద్రతకు జేడీఆర్ఎఫ్ పాటుపడుతోందని, అందరికీ అక్రిడేషన్ కార్డులు వచ్చేందుకు పనిచేస్తుందన్నారు. విలేకరులపై కొందరు కక్షతో పెట్టే తప్పుడు కేసుల సత్వర పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి తెచ్చి జర్నలిస్ట్‌లకు అండగా ఉంటామన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 2022లో ఏర్పడిన జేడీఆర్ఎఫ్ ఐదు రాష్ట్రాల్లో ఉందన్నారు. విలేకరులకు ఎల్లప్పుడు అండగా వుంటుందన్నారు.ఈ సందర్భంగా ఫోరం ఉభయగోదావరి జిల్లాల రీజనల్ సెక్రటరీగా గుత్తుల మురళీకృష్ణను, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా పి.శ్రీనివాస్‌ను ప్రకటించి నియామక పత్రాలు అందించారు. గుంటూరు, కృష్ణ జిల్లాలు, ఉత్తరాంధ్ర రీజనల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

గంగానమ్మ జాతర

బిక్కవోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొంకుదురు గ్రామ దేవత గంగానమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్ని కొంకుదురు పరిసర గ్రామ ప్రజలు వచ్చి అమ్మవార్ని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా బత్తుల



దివాన్‌చెరువు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ అభివృద్ధి సంక్షేమ సంఘం డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు(నాగు) టీడీపీ నిడదవోలు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా నియమితులయ్యారు.. ఈ విషయాన్ని ఆదివారం ఆయన విలేకరులకు తెలిపారు. పార్టీ సంస్థాగత ఎన్నికలకు తనను పరిశీలకుడిగా నియమించడంతో ఆదివారం నిడదవోలు వెళ్లి ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావును కలిసి వచ్చినట్టు నాగు చెప్పారు.

కాకినాడ రూరల్ టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా సుధాకరరెడ్డి



అనపర్తి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా అనపర్తికి చెందిన గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పార్టీ అధిష్ఠానం నుంచి సమాచారం అందినట్టు ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సుధాకరరెడ్డి అన్నారు.

పాదయాత్ర చేస్తున్న భక్తులకు బిక్కవోలులో బస

బిక్కవోలు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి అన్నవరం వెళ్తున్న 170 మంది భక్తులకు ఆదివారం రాత్రి బిక్కవోలులో కూటమి నాయకులు అన్నప్రసాదాన్ని అందించి బస కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ తాము 17 యేళ్లుగా ఈ యాత్ర చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్ చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, పల్లి రాజారెడ్డి, సింగారపు రామారావు, తొండాపు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు. ప్రజలు తమ అర్జీలు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ ద్వారా నమోదు చేసే అవకాశం ఉందన్నారు.

కొండామంటే.. బంగారమాయె!

- లక్ష దాటేసిన 10 గ్రాముల బంగారం
- 24 క్యారెట్ ధర రూ.1,01,670
- 22 క్యారెట్ రూ.93,200

(రాజమహేంద్రవరం/అమలాపురం- ఆంధ్రజ్యోతి)
పసిడి ధర మిడిసిపడుతోంది. బంగారం అందని ద్రాక్షగా మారేలా ఉంది..ఎందుకంటే ఎక్కడా తగ్గుముఖం లేదు.. పెరుగుతూనే ఉంది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు అందని సరుకుగా మారిపోతోంది. ఇక బంగారం కొనలేం అన్నట్టు ధర పెరుగుతూ పోతోంది.తులం బంగారం లక్ష దాటేసింది. ధర రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారని వ్యాపారులు,వినియోగదారులు చెబుతున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్‌లో 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.93,200లకు చేరింది.24 క్యారెట్ బంగారం 10 గ్రాముల ధర ఏకంగా రూ.లక్ష దాటేసింది. రూ.1,01,670గా ఉంది. వెండి ధర లక్షకు పైగా ఉంది.ప్రస్తుతం కిలో వెండి రూ.1,09,400గా ఉంది. శనివారం నుంచి ఈ ధరలు కొనసాగుతున్నాయి. సోమవారం తగ్గుతుందా.. పెరుగుతుందా అనేది అంచనా వేయలేని పరిస్థితి. ఇజ్రా యిల్, ఇరాన్ యుద్ధం, రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల మధ్య బంగారం ధరలు పెరుగుతున్నాయని చెబుతున్నారు.ఈ నెల 26వ తేదీ తర్వాత ఆషాఢమాసం వస్తుంది. బంగారం కొనుగోళ్లు ఉంటాయి. తర్వాత శ్రావణ మాసం జోరందుకుంటుంది.కానీ పెరుగుతున్న ధరలతో తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలని పాలుపోని పరిస్థితిలో మధ్య తరగతి సామాన్య ప్రజలు ఉన్నారు.

5 నెలలు..రూ.22 వేలు పెరుగుదల

ఇక జనవరి 1 నుంచి ఆదివారం అంటే జూన్ 15వ తేదీకి అంటే సుమారు 5 నెలల 15 రోజులకు 10 గ్రాముల బంగారం ధర రూ.22 వేలు వరకూ పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.93,200కు చేరింది.ఇదే బంగారం ధర జనవరి 1న కేవలం 71,150గా ఉంది.ఇక 24 క్యారెట్ బంగారం ధర ప్రస్తుతం రూ.1,01, 670 ఉండగా జనవరి 1న రూ.78 వేలు మాత్రమే. అంటే సుమారు 23 వేలు తేడా ఉంది. ప్రస్తు తం కేజీ వెండిధర రూ.లక్షా 9వేల 400గా ఉంది. జనవరి ఒకటన కేజీ వెండిధర రూ.88,400 మాత్రమే. జనవరి నుంచి ఇప్పటికి సుమారు రూ.21 వేలు పెరిగింది.



మార్కెట్లు..కళకళ!



తల్లికి వందనం.. జనం ఆనందం

తల్లికి వందనం డబ్బులతో జూన్ నెల టెన్షన్ నెమ్మదించడంతో కుటుంబమంతా ఆనందంగా కనిపిస్తున్నారు. దీనికి నగరాల్లోని ప్రధాన మా ర్కెట్లే నిదర్శనంగా చెప్పవచ్చు. రాజమ హేంద్రవరంలో పెద్ద బజారుకు వచ్చిన పలువురిని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా.. తల్లికి వందనం సమయానికి అందడంతో తన ఇద్దరు మనవళ్లతో బజారుకు వచ్చానని సెయింట్ ఆన్స్‌లో చదువుతున్న విద్యార్థుల బామ్మ చెప్పారు. సీఎం చంద్రబాబు తన పిల్లలకు ఇచ్చిన డబ్బులతో వాళ్లకే సైకిల్ కొనడానికి వచ్చానని కొంతమూరుకు చెందిన ఆటో డ్రైవర్ ప్రసాద్ ఆనందంగా చెప్పారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు సమయానికి పడడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆనందంగా ఖర్చు చేస్తున్నారు..దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్లలో ఆదివారం పెద్ద ఎత్తున రద్దీ కొనసాగింది.

- జనం జేబుల్లో కాసులు గలగల
- ఆదివారమైనా రద్దీగా మార్కెట్లు
- పట్టణాలకు పల్లెవాసుల క్యూ
- చిన్నారుల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
మార్కెట్లు కళకళలాడాయి..ఎటు చూసినా షాపులు జనంతో నిండిపోయాయి.. ఆదివారమైనా ఎక్కడా ఖాళీ లేదు.. పిల్లాపాపలతో పట్టణాలకు చేరుకుని చాలా మంది షాపింగ్ చేసే పనిలో పడ్డారు. సోమవారం నుంచి విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు షాపింగ్ చేసే పనిలో పడ్డారు. ఎక్కువగా బట్టల షాపులు,షూమార్ట్‌లు, బ్యాగ్‌ల దుకాణాలు, పుస్తకాల షాపులు కిటకిటలాడాయి. మరో వైపు ఫర్నిచర్ షాపులదీ అదే పరిస్థితి. ప్రతి ఆదివారం వాణిజ్యనగరం రాజమహేంద్రవరంలో ఈ షాపులు మూసివేసే ఉంటాయి. ఈ ఆదివారం ప్రత్యేకంగా తెరుచుకున్నాయి.

వ్యాపారుల ఆనందం..

'చాలా నెలల నుంచీ పెద్దగా బేరాలు లేవు. ఇవాళే కాస్త కుదుట పడుతున్నాం' అని ఓ వ్యాపారి అన్నాడంటే మార్కెట్లలో కళను అర్థం చేసుకోవచ్చు. మూడు జిల్లాల్లో చూస్తే అమలాపురం, కాకినాడ, రాజమహేంద్రవరంలో ప్రధానంగా మార్కెట్లు ఉంటాయి. కొద్ది నెలలుగా ఈ మార్కెట్లు వెలవెలబోతున్నాయి. ఈ ఆదివారం మాత్రం ఈ మార్కెట్లు రద్దీగా కనిపించాయి. ఎక్కువగా స్కూల్‌కి సంబంధించిన అవసరాల దుకణాల వద్ద జాతర మాదిరిగా జనం హడావుడి ఉంది. దీంతో వ్యాపారులు కూడా కాస్త హుషారుగా అమ్మకాలు సాగించారు. ఆదివారం కావడంలో పెద్ద షోరూమ్‌లకు మూత వేస్తారు. గతంలో మంగళవారం సెలవుగా ఉండేది. ఆదివారం ఉద్యోగులకు, పాఠశాలలకు సెలవు కావడంతో ఆ రోజున బేరం ఎక్కువగా ఉంటుందని మంగళవారం సెలవు పుచ్చుకోవడం ఉండేది. అయితే కొన్నాళ్లుగా ఆదివారం మూసేస్తున్నారు. అయితే సండే సామాన్యుడి మార్కెట్ల దెబ్బకు బేరాలు ఉండడం లేదనే ఇబ్బందితో కూడా పెద్ద షాపులు కట్టేస్తున్నారు. అక్కడక్కడా తెరిచి ఉన్న షోరూంలలో జనం టీవీలు, ఫ్రిజ్‌లు, బీరువాల వంటి ఉపకరణాలు, వంట గది సామగ్రి కొనుగోలు చేస్తూ కనిపించారు. డి.మార్ట్, రిలయన్స్, మోర్, విశాల్ తదితర షాపింగ్ మాల్స్ అయితే జనంతో రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రద్దీ కొనసాగింది. ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయాయి. ఈ ఆదివారం వ్యాపారం డబుల్ జరిగిందనేది ఒక మేనేజర్ వాదన. కాస్త డబ్బులు ఖాతాలో ఉండడం..నాలుగు రోజులు గడిస్తే వాటికి కాళ్లు వచ్చేస్తాయనే భయంతో ఇంట్లోని ఆడవారు అవసరమైన వస్తువులు /సామగ్రిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.మరోవైపు చిన్న చిన్న అప్పులను తీర్చుకోవడానికి తల్లికి వందనం సహకరించింద ని పలువురు వెల్లడించారు.బంగారం వస్తువుల కొనుగోలుపై కొందరు మహిళలు దృష్టి సారించారు. ఇలా తల్లికి వందనం సొమ్ములు అందరికీ ఉపకరించడంతో ఆనందంగా ఉన్నారు.



కుదుటపడిన బడ్జెట్..

ఏడాదిలో జూన్ నెల వచ్చిందంటే కుటుంబ బడ్జెట్‌కి దడ పట్టుకుం టుంది. ఒక్కో విద్యార్థికి ఎలా లేద న్నా రూ.10వేల వరకూ ఖర్చు తప్పదు.చంద్రన్న పుణ్యమా అని ఆ డబ్బులకు వెతుకులాడుకునే పరిస్థితి తప్పింది. జూన్‌లో స్కూల్ ఖర్చులతో మెయింటెనెన్స్ డబుల్ అవుతుంది.ఓ వైపు ఫీజులు కట్టుకొని మరో వైపు బ్యాగులు,షూలు, పుస్తకాలకు వెచ్చించాలి. ఎంతో కొంతలో కొత్త బట్టలు.. ఇతర ఖర్చులు మామూలే.దీంతో ఈ నెల వచ్చే సరికి సామాన్యుల బుర్ర అప్పు లోళ్ల చుట్టూ తిరుగుతుంది. ఎంతో కొంత చేబదులు పుచ్చుకుంటేనే గానీ ఖర్చులు గట్టెక్కని పరిస్థితి. తీరా స్కూలు అవసరాలు తీరాయని సేద తీరడానికి ఉండదు. నెలంతా ఇల్లు గడవాలి కదా!..అయితే ప్రభుత్వం దయ చూపడంతో పేద లు, మధ్య తరగతి జీవితాలకు ఈ నెలలో రుణం పుచ్చుకునే అవసరత తప్పింది. సీఎం చంద్రబా బు తన హామీని నిలబెట్టుకుంటూ తల్లికి వందనం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుండడంతో హుషారుగా బజారుకు వెళ్లి ఉత్సా హంగా అన్నీ కొనేసి పిల్లల ఆనందంలో తమ సంతోషాన్ని చూసుకుంటున్నారు. ఖాతాల్లో డబ్బులు గలగల లాడడంతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.



ఇక తవ్వేయ్!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

- రేపోమాపో మైనింగ్ పాలసీ
- ఏడాదిగా కొత్త లీజుల్లేవ్
- కుంటుపడిన మైనింగ్
- గత వైసీపీలో పూర్తిగా ధ్వంసం
- మార్పులతో ప్రభుత్వం శ్రీకారం

జిల్లాలో చాలా కాలం తర్వాత మైనింగ్ సందడి మొదలు కాబోతుంది. రేపో మాపో మైనింగ్ పాలసీ మీద జీవో రాబోతుంది. గత వైసీపీ పాలనలో మైనింగ్ విధానం ధ్వంసమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ పెద్దలే నేరుగా రంగంలోకి దిగి.. లీజుదార్లను తరిమికొట్టేసి మైనింగ్ చేయించిన సంఘటనలు ఉన్నాయి.గత సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలో వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పాలసీ తెచ్చింది.కానీ ఏడాదిగా మైనింగ్ లీజులు లేవు.ఈ ఏడాది ఏప్రిల్ 29న కొత్తపాలసీపై ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. దానిని జీవో రూపంలో ఒకటి రెండు రోజుల్లో జారీ చేయనుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బిల్డింగ్ మెటల్, రోడ్ మెటల్, గ్రానైట్, గ్రావెల్, లేటరైట్ గనులు ఉన్న సంగతి తెలిసిందే. వీటిలో ఇప్పటి వరకూ స్వంత స్థలాలు లీజుకు తీసుకున్నవారు తప్ప.. ప్రభుత్వ స్థలాలు లీజుకు ఇవ్వలేదు.

ఉమ్మడి జిల్లాలో 250 దరఖాస్తులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 250 లీజు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.ఒకట్రెండు రోజుల్లో రాబోతున్న కొత్త మైనింగ్ పాలసీ వల్ల మళ్లీ లీజులు మొదలు కానున్నాయి.ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) ప్రకారం 2023 మార్చి 13వ తేదీ నాటికి ఫైలైన పెండింగ్ మినరల్ కన్సెషన్ దరఖాస్తులు పరిశీలించి పరిష్కారానికి ఒక విధానం రూపొందించారు.సింగిల్ డెస్క్ పోర్టల్, మీసేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు గుర్తించి జిల్లా మైనింగ్ అధికారి లాగిన్‌లో ఉంచుతున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులకు ఆమోదం తెలిపి అర్హత లేనివాటిని తొలగిస్తారు. అర్హత ఉన్న దరఖాస్తుదారుల నుంచి భద్రత డిపాజిట్ కట్టించుకుంటారు. మూడు నెలల్లోపు ఈ చెల్లింపులు చేయాలి. తర్వాత ఎన్‌వోసీ, డీజీపీఎస్ సర్వేలు చేస్తారు. భద్రత డిపాజిట్ చెల్లించకపోతే అర్హత కోల్పోతారు. గ్రానైట్ల మార్బుల్,బిల్డింగ్ మెటీరియల్‌కు తాజాగా దరఖాస్తు చేయాలి. ఇండస్ట్రియల్ మినరల్‌కు వేలం పద్ధతి ఉంటుంది.ఇవన్నీ ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

గత ప్రభుత్వంలో దోపిడీ

గత ప్రభుత్వంలో మైనింగ్ అంతా ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ పెద్దల చేతుల్లోకి పోయింది. అంతకుముందు ఎవరైనా వ్యక్తికి సొంత కొండ ఉంటే దానిని పంట సాగుకు సరిచేసుకోవడానికి తహశీల్దార్, ఇతర అధికారులకు దరఖాస్తు చేస్తే సరిపోయేది. ప్రస్తుతం సొంత భూమిలో మినరల్ ఉన్నా, కొండలు ఉన్నా, ఆయా ఎమ్మెల్యేల అనుమతి తీసుకోవాల్సి వస్తుంది. ఇటీవల అక్కడక్కడా తవ్వుతున్న గ్రావెల్, మట్టి వంటి వాటిలో కూడా లారీకి రూ.3 వేల వరకూ ఆయా ప్రాంత ప్రతినిధులు లాగేస్తుండడం గమనార్హం. గత ప్రభుత్వం సీనరేజి ప్రైవేట్ పరం చేసి కూడా బాగా దోచుకుంది. రేపో మాపో ప్రభుత్వం అమల్లోకి తీసుకురానున్న కొత్త మైనింగ్ పాలసీలో ఏ మినరల్‌ను ఏ విభాగంలో పెడతారో, ఏ ధరలు నిర్ణయిస్తారో, సీనరేజి పరిస్థితి ఏంటో అనే చర్చ ఆయా వర్గాల్లో మొదలైంది.

కోకో రైతులకు ప్రత్యేక సెల్ : ఆర్డీవో



కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజల కొనుగోలుకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల నుంచి కోకో గింజల సేకరణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో కోకో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేస్తామన్నారు. రైతులకు ఇబ్బందులెదురైతే ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సోమవారం నుంచి ఈ సెల్ అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినతులు స్వీకరించడం జరుగుతుందన్నారు. వాస్తవ సాగుదారుల నుంచి కోకో దిగుబడుల వివరాలను ఈ నెల 30వ తేదీలోగా సేకరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారన్నారు. కోకో గింజలకు కనీస మద్దతు ధర రూ.500లు రావాలని ఈ సెల్ ఏర్పా టు చేశామన్నారు. ఏమైనా సందేహాలుంటే 79953 67797 నెంబరును పనివేళల్లో సంప్రదించాలన్నారు. రైతుల నుంచి వినతులు స్వీకరించడానికి ఉద్యానవన అధికారి అందుబాటు లో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు.



ఈ వయసులో..అనాథలా!

కాటికి కాలు చాచిన వయసులో ఎంతో మంది వృద్ధులకు జీవశ్ఛవాలుగా కాలం వెళ్లదీస్తున్నారు..అయినా పట్టించుకునే వారే లేరు..రోజురోజుకు అనాథలుగా మారుతున్న వృద్ధుల సంఖ్య కోకొల్లలు.. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ఇటువంటి వారి పరిస్థితి దయనీయమే.. ఈ చిత్రంలో చూశారా..ఈ వృద్ధుడు లేచి నడవలేడు.. గత మూడు నెలలుగా జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం సమీపంలోని రావులపాలెం- వేమగిరి జాతీయరహదారిలో ఆంజనేయస్వామి ఆలయం కింద ఉంటున్నాడు.. ఎవరైనా ఏదైనా పెడితే తింటాడు..లేదంటే పస్తులుంటాడు.. మీ ఊరెక్కడ అంటే రాజస్థాన్ అంటున్నాడు.. పేరు అంటే మధు అంటున్నాడు.. మిగిలిన వివరాలేవీ చెప్పలేకపోతున్నాడు.. జిల్లా అధికారులు స్పందించి ఇటువంటి వృద్ధు లను వృద్ధాశ్రమాలకు తరలించాల్సి ఉంది. **- కడియం**

గోకవరంలో అత్యధిక వర్షపాతం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడచిన 24 గంటల్లో గోకవరం మండలంలో అత్యధికంగా 88.8 మి.మీ.. అత్యల్పంగా పెరవలి,నల్లజర్లలో 2.6 మి.మీ వర్షం కురిసింది. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ 41.2 మి.మీ, రూరల్‌లో 39.4 మి.మీ, తాళ్ళపూడిలో 31.8, రాజానగరం 30.2, కోరుకొండ 26.4 , సీతానగరంలో 25.0 , అనపర్తిలో 19.2, బిక్కవోలులో 10.8, కడియంలో 7.6, దేవరపల్లి 7.2, కొవ్వూరులో 6.8, చాగల్లులో 6.4, నిడదవోలులో 6.4, రంగంపేటలో 4.8, గోపాలపురంలో 4.0, ఉండ్రాజవరంలో 3.2, నల్లజర్లలో 2.6 మి.మీ వర్షం కురిసింది. అధికశాతం ఆదివారం తెల్లవారుజామున వర్షం పడింది.

ఆహా ఆలివ్!



హోప్ ఐలాండ్ తీరంలో గుడ్లు పెట్టిన ఆలివ్ రిడ్లే తాబేలు

ఆలివ్ రిడ్లే.. చేస్తోంది మేలు..

కొన్ని జీవులు చాలా తెలివిగా ఉంటాయి.. వాటి తెలివితేటలు అంచనా వేయడం అంత సులభం కాదు.. అటువంటి జీవుల్లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు గురించి చెప్పకుండా ఉండలేం.. అవి దేశవిదేశాలు తిరిగి మళ్లీ అవి ఎక్కడైతే పుడతాయో అక్కడే పిల్లలను పొదుగుతాయంటే నమ్ముతారా.. నమ్మక తప్పదు మరి.. ఎందుకంటే ఇది నిజం.. ఆ కథేమిటో తెలియాలంటే ఈ కథనం చదివేయాల్సిందే మరి.. నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- 2023-24లో హోప్ ఐలాండ్‌లో 262 తాబేళ్లు 23,202 గుడ్లు పెట్టాయి.
- 2024-25లో హోప్ఐలాండ్‌లో 283 తాబేళ్లు 20,623 గుడ్లు పెట్టాయి.



ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ చర్యలు

- సముద్రజలాల సంరక్షణ
- మత్స్యసంపద అభివృద్ధి
- డిసెంబర్ - మే మధ్య సంచారం
- గుడ్లు పెట్టి సంతానోత్పత్తి
- కాకినాడ,కోనసీమలో సంరక్షణ
- నేడు ప్రపంచ సముద్ర తాబేళ్ల పరిరక్షణ దినోత్సవం

కాకినాడ/ఉప్పలగుప్తం/కాట్రేనికోన, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాలు కలుషితం కాకుండా.. మత్స్యసంపద అభివృద్ధికి సహకరించే సముద్రపు జీవుల్లో ప్రత్యేకమైనవి ఆలివ్ రిడ్లే తాబేళ్లు. తీరానికి దూరంగా సముద్రపు లోతుల్లో జీవించే ఈ తాబేళ్లు సాగర జీవుల ఆహార గొలుసులో కీలకపాత్ర పోషిస్తాయి.సముద్రపు నాచు తింటూ.. జలాలను శుభ్రపరుస్తాయి. సముద్రంలో తాబేళ్ల సంఖ్య తగ్గిపోతే ఎదురయ్యే ప్రమాదాలను గుర్తించిన ప్రభుత్వం ఏటా వీటి సంరక్షణకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏడు రకాల సముద్రపు తాబేళ్లు ఉంటాయి. మన భారతదేశ సముద్ర జలాల్లో ఐదు రకాల సముద్రపు తాబేళ్లు ఉన్నాయి. వాటిలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒకటి. ఈ జాతి ఆడ, మగ తాబేళ్లు ఏటా డిసెంబర్ మాసంలో సంతానోత్పత్తికి సముద్రంలో కలుసుకుంటాయి. కొన్నిరోజులపాటు తీర ప్రాంతంలో సంచరిస్తాయి. జనవరి మొదటివారం నుంచి ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు సిద్ధమవుతాయి. ఫిబ్రవరి నెలలో భారీగా గుడ్లు పెట్టి.. ఏప్రిల్ నాటికి పూర్తిగా ఆపేస్తాయి. ఇవి పెట్టిన గుడ్లు పొదిగి పిల్లలుగా మారేందుకు సుమారు 40 నుంచి 50 రోజుల సమయం పడుతుంది. ఈ ప్రక్రియ డిసెంబర్ నుంచి మే వరకు జరుగుతుంది.ఈ ఆరు నెలల్లో ఆలివ్ రిడ్లే సంతానోత్పత్తి జరుగుతుంది.కోనసీమ జిల్లాలో ఐదు ప్రాంతాల్లో ఆలివ్‌రిడ్లే తాబేళ్ల హేచరీలున్నాయి.

కాకినాడ, కోనసీమ తీరాలకు..

సంతానోత్పత్తి సమయంలో ఈ ఆలివ్ రిడ్లే తాబేళ్లు కాకినాడ హోప్ఐలాండ్, కోనసీమ జిల్లాలోని ఎస్.యానాం, వాసాలతిప్ప, జీకే పోర, సాక్రిమెంట్ ఆయిల్ పలు తీరప్రాంతాలకు పెద్ద ఎత్తున వస్తుంటాయి.ప్రధానంగా డిసెంబర్ నెలలో 15-20 రోజులపాటు తీర ప్రాంతాల్లో ఇవి ఉంటాయి. మగ తాబేలు సముద్రంలోకి వెళితే.. కేవలం ఆడ తాబేళ్లు మాత్రమే తీరంలో ఉంటూ గుడ్లను పెట్టి తిరిగి వెళ్లిపోతాయి. అడుగు నుంచి అడుగున్నర లోతు గొయ్యిని తవ్వుకుని..వాటిలో 60 నుంచి 160 వరకు గుడ్లు పెడతాయి.ఈ సమయంలో గుడ్లు రూపాంతరం చెందుతాయి. 28 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కన్నా తక్కువుంటే ఆ సమయంలో పెట్టిన గుడ్లన్నీ మేల్ జాతికి చెందినవిగా, 30 డిగ్రీల ఉష్ణోగ్రతపైబడి ఉన్న సమయంలో పొదిగిన గుడ్లు ఆడ తాబేళ్లుగా మారతాయి. 28-30 డిగ్రీ మధ్య ఉష్ణోగ్రతలో జన్మించిన తాబేళ్లు అటు మేల్ అయినా కావొచ్చు. ఇటు ఫిమేల్ అయినా కావొచ్చని శాస్త్రవేత డి.మహేష్‌బాబు తెలిపారు.

ఒడిశా టు కాకినాడ..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల జీవన విధానం, పునరుత్పత్తి గురించి పరిశోధనలు జరుగుతున్నాయి.అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రం నుంచి ఇవి వేల కిలోమీటర్ల ప్రయాణం చేసి ఇక్కడికి చేరుకుంటాయి. ఒక తాబేలు ఒడిశాలో కేంద్రపడ జిల్లా గహీర్‌మఠ్ వద్ద సముద్రంలో ప్రయాణం ప్రారంభించి 51 రోజుల తర్వాత శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరిల మీదుగా ఇది ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరుకుంది. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ట్యాగ్ దీనికి అమర్చి పరిశీలించగా ఈ విషయం తెలిసిందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.వాటికి అనుకూలమైన వాతావరణం ఉన్న కాకినాడ హోప్ ఐలాండ్‌తో పాటు కోనసీమలోని పలు తీర ప్రాంతాల్లో ఇవి సంతానోత్పత్తి చేపడతాయి.

ఆ రెండింటి మధ్య వ్యత్యాసాలివే..

ఆలివ్ రిడ్లే తాబేళ్ల ఏ తీరానికి పడితే ఆ తీరానికి రావు. ఒకసారి ఎక్కడైతే సంతానోత్పత్తి కోసం గుడ్లు పెట్టాయో.. తిరిగి అదే ప్రాంతానికి వస్తాయి. సాధారణ తాబేళ్ల కన్నా ఇవి పరిమాణంలో పెద్దగా ఉంటాయి. ఇవి 35 నుంచి 50 కిలోల బరువుతో సముద్రపు నీటిలోనే ఉంటాయి. తాబేళ్లు తీరానికి చేరుకునే సమయంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో బోట్లు తిరగకుండా, చేపల వేట నిలిపివేసేలా చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. తాబేళ్ల రాకకు ఏటా అటవీశాఖ అధికారులు బేస్ క్యాంపులు సిద్ధం చేస్తున్నారు.ఏటా తాబేళ్ల రాక సంకేతాలను గుర్తించి బీచ్ పరిసర ప్రాంతాలు శుభ్రం చేస్తున్నారు.గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నారు.



సంరక్షణకు ప్రత్యేక చర్యలు

1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. సముద్ర తాబేళ్లను సంరక్షణకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. హేచరీలను ఏర్పాటు చేసి వాటి సంతతిని పెంచే ప్రయత్నాలు చేస్తున్నాం. కాకినాడ హోప్ఐలాండ్‌లో మత్స్యకార కుటుంబాలకు వీటి సంరక్షణ బాధ్యత అప్పగించి, వారికి జీవనోపాధి కల్పిస్తున్నాం. ఆరుగురు బృందంగా బేస్‌క్యాంపులు ఏర్పాటు చేసి వాటిని సంరక్షిస్తున్నాం.

- ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, కోరింగ వైల్డ్ లైఫ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

కొవ్వూరు



పోలవరం కాలువ వంతెనపై ప్రవహిస్తున్న వర్షం నీరు

పోలవరం కాలువ వంతెనపై నీరు తొలగించాలి

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

దేవరపల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి, దుద్దుకూరు మధ్యలో ఉన్న పోలవరం కాల్వ వంతెనపై చిన్నపాటి వర్షానికే నీరునిల్వ ఉండి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.ఈవంతెనపై పోలవరం, తాడిపూడి కాలువపైన వంతెనపై మట్టి పేరుకుపోవడంతో వర్షపునీరు కిందకు వెళ్లే మార్గంలేక వంతెనపై నీరు నిల్వ ఉండిపోతుంది. ఆర్అండ్‌బీ అధికారులు ఎప్పటికప్పుడు మట్టి తొలగించాల్సి ఉండగా నిర్లక్ష్యంగా ఉండటంవలన నీరు వెళ్లడానికి పెట్టిన కన్నాలు మట్టితో పూడుకుపోవడం, గడ్డి పేరుకుపోవడంతో ఆ వంతెనపై చెరువులా తయారవుతుంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే వంతెనపై నీరు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'పేదలకు వరం సీఎం సహాయనిధి పథకం'



లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, జూన్15 (ఆంధ్రజ్యోతి): పేదలకు వరంలా సీఎం సహాయనిధి పథకం పనిచేస్తున్నదని ఏపీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం వేలివెన్నులో నియోజకవర్గంలోని నిడదవోలు పట్టణం, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు రూరల్ మండలాలకు చెందిన 49మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.28.98లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో వైద్యం చేయించుకోలేని వారికి ఆర్థికంగా కొంత చేయూతనివ్వడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతున్నట్లు శేషారావు చెప్పారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోతవరంలో గంగానమ్మ జాతర



పోతవరం జాతరలో జనసందోహం

నల్లజర్ల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం పోతవరంలో గంగానమ్మ జాతర మహోత్సవం ముగింపురోజు వైభవంగా జరిగింది. ఆదివారం అమ్మవారి నైవేద్యం కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి లక్షలసంఖ్యలో బంధుమిత్రులు స్నేహితులు హా జరయ్యారు. వేలాది వాహనాలు రాకలతో పోతవరం నుంచి కవులూరు వరకు, అటు అరిపాటిదిబ్బల వరకు వాహన రాకపోకలు స్తంభించాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, పీతల సుజాత, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రాజీవ్‌కృష్ణ హాజరయ్యారు. మండలంలో ప్రధాన మేజర్ పంచాయతీ పోతవరం కావడంతో సుమారు 2లక్షల మంది జాతర మహోత్సవానికి విచ్చేశారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన భోజన కార్యక్రమాలు సాయంత్రం 4గంటల వరకు కొనసాగాయి.

తల్లుల ఆనందాన్ని ఓర్వలేక వైసీపీ విషప్రచారం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలుచేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 15వేలు చొప్పన తల్లికి వందనం ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. పాఠశాల నిర్వహణ ఖర్చుల నిమిత్తం మినహాయించిన రూ.2వేలు మంత్రి లోకేష్ జేబులోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని, దమ్ముంటే రుజువు చేయాలన్నారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్‌రెడ్డి తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రూ.42లక్షల మందికి అమ్మఒడి ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27లక్షల మంది విద్యార్థులకు రూ.8700లు తల్లికి వందనం ఇస్తుందన్నారు. 1వ తరగతిలోను, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేరే విద్యార్థులు 11లక్షల మందికి డేటా అప్లోడ్ అయిన వెంటనే డబ్బులు వేస్తామన్నారు. తల్లి లేని పిల్లలకు తండ్రి లేదా సంరక్షకుని ఖాతాలోను, అనాధ పిల్లలకు జిల్లా కలెక్టర్ నిర్ధారించిన తరువాత పథకం అమలు చేస్తామన్నారు. జగన్‌రెడ్డి కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని మాయమాటలు చెప్పి 12లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ నాశనం చేశాడన్నారు.

నలుగురి పిల్లల తల్లికి వందనం సొమ్ము జమ



తీపర్రుకు చెందిన తీపర్తి సత్యనారాయణ కుటుంబ సభ్యులు

పెరవలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంద్వారా తమ కుటుంబంలోని నలుగురు పిల్లలకు మొత్తం రూ.52 వేలు బ్యాంక్ అకౌంటులో జమయ్యాయని ఇది ఎంతో ఆనందం కలిగించిందని తీపర్రుకు చెందిన తీపర్తి సత్యనారాయణ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో కేవలం ఒక్కరికి మాత్రమే సొమ్ములు పడేవని ప్రస్తుతం సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కుటుంబం లోని పిల్లలందరికీ డబ్బులు జమకావడం ఎంతో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. తనకు ఐదుగురు సంతానమని పెద్ద కుమార్తె డిగ్రీ చదువుతున్నందున ఆమెకు మినహా మిగిలిన నలుగురికి సొమ్ములు వచ్చాయని తెలిపారు.

'మంద కృష్ణ మాదిగ ఆశయాల కోసం పనిచేద్దాం'

నల్లజర్ల, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మాదిగ సోదరులంతా ఐక్యంగా ఉండి మందకృష్ణ మాదిగ ఆశయాలకోసం పనిచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బయ్యవరపు రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గుండేపల్లిలో స్థానిక మాదిగలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ రక్షణ పోరాట సమితి కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో కమిటీలువేసి అధ్యక్షులను ఎన్నుకోవాలన్నారు. నియోజక వర్గస్థాయిలో జూలై 7 జరుగబోయే సమావేశంలో మాదిగలంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు మర్రి కిషోర్, చెట్టి శ్రీను, దొరబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలోని చివటం అగ్రికల్చర్ ఫీడర్, పాలంగి గ్రామంలో ఈనెల 16 తేదీ సోమవారం ఉదయం 7 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఎన్ అప్పారావు తెలిపారు. విద్యుత్‌లైన్లు మరమ్మతుల కారణంగా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జూనియర్ లెక్చరర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణ



అయినపర్తి మురళీకృష్ణ

కొవ్వూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జూనియర్ లెక్చరర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ అయినపర్తి మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో కొవ్వూరు బాలికల కళాశాల హిందీ అ ధ్యాపకుడు డాక్టర్ అయినపర్తి మురళీకృష్ణను ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వీరి పదవికాలం 2028వరకు కొనసాగుతుందన్నారు. కార్యదర్శిగా ఎ.వెంకటరమణ (ధవళేశ్వరం), ఉపాధ్యక్షుడిగా దుగ్గిరాల మోహన్, సహాయ కార్యదర్శిగా డి.హరీష్, కోశాధికారిగా ఎ.కళ్యాణ్‌కుమార్, మహిళా కార్యదర్శిగా వై.శివకుమారి, రాష్ట్ర కౌన్సిలర్స్‌లుగా ఎస్. రాంబాబు, ఎం.ఏ. కళ్యాణ్‌లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.బి.హనుమాన్, పరిశీలకులుగా ఎస్.కె.ఖాశీం పీరా వ్యవహరించారు.

సామాజిక స్పృహ ఉన్నప్పుడే సేవాభావం అలవడుతుంది



ప్రతిభా పురస్కార అవార్డులను అందుకున్న విద్యార్థులతో మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ ఉన్నప్పుడే సేవాభావం అలవడుతుందని మానవత సంస్థ కేంద్ర కమిటీ సభ్యుడు ఆలపాటి నాగేశ్వరరావు, సంస్థ డైరెక్టర్ తానింకి సత్యనారాయణ అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మండల మానవత నూతనకమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేంద్ర కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు మానవత సంస్థ సభ్యులు ఇప్పటివరకు చేసిన సేవా కార్యక్రమాలు సమా వేశంలో వివరించారు. అనంతరం ప్రతీఏటా మండల పరిధిలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలతోపాటు నగదు ప్రోత్సాహం, జ్ఞాపిక అందజేశారు. మండల పరిధిలో ఉన్న 9 పాఠశాలల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక ధ్రువీకరణ పత్రంతో సత్కరించారు. నూతనకమిటీ అధ్యక్షుడిగా రాపాక ఫణికిషోర్ ఆధ్వర్యంలో మండలంలో ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన మానవత సంస్థ సభ్యులను ఘనంగా సత్కరించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా రాపాక ఫణికిషోర్, కార్యదర్శి జుత్తిగ సూర్యచంద్రం, కోశాధికారి గడా జోగేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి శేఖర్‌బాబు, ఉపాధ్యక్షుడిగా కాకర్ల సూర్యప్రకాశరావు, అత్యవసర, విద్యా,ఆరోగ్య, అవగాహన ప్రతినిధు లుగా జయ, సర్వేశ్వరరావు, నాగేంద్ర, వెంకా యమ్మ, కాశీం సాహెబ్, ప్రమా ణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రయ్య, రాజ్‌కుమార్, సత్యనారాయణ, రాంబాబు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు, మండల మానవత మాజీ అధ్యక్షులు పప్పుకృష్ణారెడ్డి, నిల్లి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కోట సత్తెమ్మ ఆలయంలో యోగాంధ్ర

నిడదవోలు, జూన్15(ఆంధ్రజ్యోతి) నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి ప్రారంభమై ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు సిబ్బంది వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని యోగాసనాలు వేశారు.

కోట సత్తెమ్మ అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోట సత్తెమ్మ అమ్మవారి దేవ స్థానంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు అమ్మవారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేకదర్శనం ద్వారా రూ.30,000లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.12,720, ప్రసాద విక్రయాల ద్వారా రూ.30,645లు, పూజా టికెట్లు, ఇతర టికెట్లద్వారా రూ.65,050లు, మొత్తం రూ.1,38, 495లు ఆదాయం లభించినట్లు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరిసూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.

ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

పెరవలి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాలల భవి ష్యత్‌ను మెరుగు పరిచే విధంగా నవజీవన్ సంస్థ కృషిచేస్తుందని సంస్థ కోఆర్డినేటర్ శ్రీతేజ అన్నా రు. ఆదివారం కాకరపర్రులో విజయవాడకు చెందిన డాన్‌బాస్కో నవజీవన బాలభవన్ స్వచ్ఛ ంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. సర్పంచ్ గుబ్బల శ్రీనివాస్ దంపతులు, జ్యోతిబాబు పాల్గొన్నారు.

'పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి'



సమావేశంలో పాల్గొన్న శేషారావు, ఇతర నాయకులు

ఉండ్రాజవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఆదివారం వేలివెన్నులో జరిగిన నియోజకవర్గ టీడీపీ మండల కమిటీల నియామ, ఇతర అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని, వీటిని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ మరింత పటిష్టతకు క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జిలు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు డీవీ సత్యనారాయణ, మండలానికి చెందిన పరిశీలకులు బత్తుల నాగేశ్వరరావు, మజ్జి పద్మావతి, దయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నమన పరమేశ్వరరావు, నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నాయకులు వట్టికూటి వెంకటేశ్వరరావు, సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం

నిడదవోలు, జూన్15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వృద్ధుల శేషజీవితం వేధింపులకు గురికాకుండా గౌరవంగా జీవించేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సీనియర్ సిటిజన్స్ ఫోరం మండలశాఖ అధ్యక్షుడు సూర్యచంద్రరావు అన్నారు. ఆదివారం నిడదవోలులో సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వృద్ధులపట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ పెద్ద కుటుంబాలు కాస్తా చిన్న కుటుంబాలుగా మారిన తరువాత వృద్ధులకు ఆదరణ కరువైందన్నారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు బట్టలు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో కొత్తపల్లి నాగేశ్వరరావు, పొన్నా సుబ్రహ్మణ్యం శర్మ, ఖండవల్లి రంగాచార్యులు, పుల్లూరి రామమూర్తి, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన



ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్న డిపో మేనేజర్ కుమార్

కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆర్టీసీ ఆదాయం తీసుకురావడానికి కృషిచేసిన ఉద్యోగులను సత్కరించినట్లు కొవ్వూరు డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్ తెలిపారు. కొవ్వూరు ఆర్టీసీ డిపోలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు ఉద్యోగులకు ఆదివారం అభినందన సభ నిర్వహించారు. డ్రైవర్ కేటగిరిలో ఉత్తమ కెఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు వై.పైడిరాజు, కె.ఎస్.వాసు, ఆదాయం తీసుకురావడంలో టీమ్ డ్రైవర్ కె.శ్రీను, కండక్టర్ కేటగిరిలో ఎస్.కె.ఏ.బాషా, జి.బి.ఎస్.నారాయణలను కుటుంబ సమేతంగా సత్కరించారు.

పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి, విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన బండి వేణుకు సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ పత్రాలను ఎమ్మె ల్యే అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ ఛైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్, సూర్యదేవర రంజిత్, నాయుడు వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చడం అభినందనీయమని రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మండలంలోని సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ యూనిట్ ఇన్‌ఛార్జి కూచిపూడి వెంకటరామారావు కుమార్తె రేణుకా శారద పదో తరగతిలో మండలస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించి, ప్రతిభ అవార్డుకు ఎంపిక కావడంపట్ల శేషారావు ఆదివారం ఆమెను అభినందించి, మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నందిన శ్రీనివాస్, నాయకులు శిరిగిన బాబి రమేష్, ఎం.రవీంద్రరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం తరపున 40కేజీల బియ్యం పంపిణీ చేసినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఈనెల 14వ తేదీ రాత్రి కొవ్వూరు 4వ వార్డులో ఇప్పర్తి సుబ్బాయమ్మ తాటాకిళ్లు అగ్నికి ఆహుతైంది. ఈ సందర్భంగా రెవెన్యూ నుంచి నాలుగు కుటుంబాలకు ఒక్కొక్కరికీ 10కేజీల చొప్పన మొత్తం 40 కేజీలు బియ్యం ఆదివారం ఛైర్‌పర్సన్ రత్నకుమారి అందజేశారు. ఇంటి నిర్మాణం చేసుకునే వరకు కమ్యూనిటీ హాలులో ఆశ్రయం పొందాలన్నారు. బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. మానవతా దృక్పదంతో బాధితులకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించిన తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు. వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు బాధితులకు 25 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్టూరి అన్నవరం, సురేష్, దొరబాబు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, విద్యార్థులకు అన్నదానం



గౌడ సంక్షేమ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంటు తాతా కృష్ణారావుకు మెమెంటో అందిస్తున్న నాయకులు

కొవ్వూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సామాజికవర్గ అభివృద్ధికి, ఐక్యతకు తాతా కృష్ణారావు విశేష కృషి చేస్తున్నారని గౌడ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంటు మట్టా వీరబాబు అన్నారు. ఆదివారం గౌడ సంక్షేమ సంఘం ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ తాతా కృష్ణారావు జన్మదినాన్ని పురస్కరించుకుని వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టారు. వాత్సల్యా వృద్ధాశ్రమం, దృష్టి ప్రదాత అంధుల పాఠశాల, మదర్ థెరిస్సా వీధి బాలల పునరావాస కేంద్రంలో వృద్ధులు, విద్యార్థులకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. తాత కృష్ణారావుకు సంఘం గౌరవాధ్యక్షులు మస్సెం సన్నిబాబు, భీమన ఝాన్సీరాణి, బి.చత్రపతి శివాజీ, సర్పంచ్‌లు మట్టా శ్రీనివాస్, మట్టా వెంకట్రావు, నాయకులు మారిశెట్టి మురళీ, బొర్రా కృష్ణారావు తదితరులు పుష్పగుచ్ఛాలు అం దించి శుభాకాంక్షలు తెలిపారు.

సంగాయిగూడెం సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి



కరుటూరి సుబ్బారావు

దేవరపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం సంగాయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు కరుటూరి సుబ్బారావు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుమారులు కరుటూరి శ్రీనివాస్ పొగాకుబోర్డు రైతు సంఘం అధ్యక్షులుగా, వీరి కోడలు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. కరుటూరి సుబ్బారావు గ్రామానికి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. దాంతో గ్రామంలోని పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

స్వామివారికి స్వర్ణ పుష్పార్చన

దేవరపల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా స్వర్ణ పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన నిర్వహించారు.